## చౌకీమఠంలో ఘనంగా సేవా కార్యక్రమాలు

**-ఆకట్టుకున్న మల్లయోధుల కుస్తీ పోటీలు**

**సదాశివపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

వీరశైవ సమాజం చౌకీమఠం (శ్రీజగద్గురు పంచాచార్య బసవ సేవాసదన్)లో విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 4వ తారీఖు నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న వివిధరంగాల సేవాకార్యక్రమంలో భాగంగా మంగళవారం కుస్తీపోటీలు నిర్వహించినట్లు అధ్యక్షులు చీల మల్లన్న పేర్కొన్నారు. కుస్తీపోటీల్లో విజయం సాధించిన వారికి ప్రథమబహుమతిగా 50గ్రాముల వెండికడియం, ద్వితీయబహుమతిగా 30గ్రాముల వెండికడియం, తృతీయబహుమతిగా 20గ్రాముల వెండికడియంను బహూకరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బడగామ శ్రీశైలం, కోశాధికారి పులుమామిడి వీరేశం, ఉపాధ్యక్షులు గంటతల బసవరాజ్, ఉల్లిగడ్డ నాగన్న, సంగమేశ్వర్, పులుమామిడిసుధాకర్, దూది రామశెట్టి, రాచన్నస్వామి, చందుస్వామి, తుమ్మలపల్లిశంకర్, నాగిశెట్టి, జంగంమహేష్‌స్వామి, మల్లయ్యస్వామి, ఈశ్వర్, అశోక్‌స్వామి, నాగభూషణం పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ సస్పెన్షన్

**-ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**జహీరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

విచారణ నిర్వహించకుండా తప్పుడు ధృవీకరణ పత్రం అందజేసినందుకు రెవెన్యూ ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్‌లను సస్పెన్షన్‌చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం...జహీరాబాద్ మండలానికి చెందిన షేక్ అహ్మద్ జీవించే ఉన్నప్పటికీ కోడలు బిపాషా వినతి మేరకు ఆర్ఐ యాదిలాల్ క్షేత్రస్థాయిలో పంచనామా నిర్వహించకుండా పంచనామా నివేది కను అందచేయడంతో అప్పట్లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన (ప్రస్తుతం కల్హేర్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులునిర్వహిస్తున్న) బిటి పవన్‌కుమార్ క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే వారసత్వ ధృవీకరణపత్రాన్ని జారీచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విధి నిర్వహణలో అలక్ష్యం వహించినందుకు తెలంగాణ సివిల్ సర్వీసెస్(సిసిఎ) రూల్స్1991లో రూల్ (8) సబ్‌రూల్ 18(2)ను అనుసరించి డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐలను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సిఎంను కలిసిన మాజీ ఎంపిటిసి



ఎంఎస్ఆర్ పి-1: ఎంపి శెట్కార్‌తో ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎంపిటిసి రవీందర్

**మనూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మంగళవారం హైద్రాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌శెట్కార్‌లతో కలిసి ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు రవీందర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గౌడసంఘం నేతలు

**గజ్వేల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లో మే 1వ తేదీ గురువారం నుండి 6వ తేదీ మంగళవారం వరకు జరుగనున్న శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ విగ్రహప్రతిష్ఠా మహోత్సవ ఆహ్వానపత్రికను ప్రజ్ఞాపూర్ గౌడసంఘం ప్రతినిధులు మంగళవారం రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైద్రాబాద్‌లోని వారినివాసంలో కలిసి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహప్రతిష్ఠా మహోత్సవానికి తప్పకుండా హాజరవుతానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపినట్లు పేర్కొన్నారు.

## తేమశాతం రాగానే వెంటనే ధాన్యం లోడ్ చేయాలి

**-కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లాకలెక్టర్ మనుచౌదరి**



మర్రిముస్త్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**కొమురవెల్లి/చేర్యాల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సక్రమంగా ధాన్యం సేకరణ, కేంద్రంలో అన్ని సదుపాయాలు, తేమశాతం రాగానే వెంటనే లోడ్‌చేసే విధంగా పనిచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం కొమురవెల్లిమండలం మర్రి ముస్త్యాల, చేర్యాలమండలం తాడూరుగ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలలో గన్ని బ్యాగ్‌లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, కంటాలు, పాడిక్లీనర్లు, వేసవికాలం దృష్ట్యా తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. అకాలవర్షాల మూలంగా ధాన్యం తడవకుండా టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తేమ శాతం చెక్‌చేసి తేమ శాతం రాగానే వెంటనే లోడ్‌చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లారీల కొరతలేకుండా చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌వెంట ఎపిఎంలు, సెంటర్‌సిబ్బంది ఉన్నారు.

## ఈ పరిశ్రమ మాకొద్దు

**-పరిశ్రమ ముందు రైతుల నిరసన**



పరిశ్రమ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట మండల పరిధి చందంపేట గ్రామంలో నూతనంగా నిర్మించబోయే ఎమ్మెస్ ఫ్యాక్ టికట్ అనే పరిశ్రమ నిర్మాణ పనులను గతంలో గ్రామస్థులు అడ్డుకున్న సంగతి విదితమే. మంగళవారం పరిశ్రమ యజమాన్యం నిర్మాణ పనులు చేపడుతున్నారనే విషయం తెలుసుకున్న గ్రామస్థులు పరిశ్రమ వద్దకువెళ్లి నిరసన వ్యక్తంచేశారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామశివారులో ఉన్న రసాయనపరిశ్రమ కాలుష్యంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మరో రసాయనపరిశ్రమ పడితే కాలుష్యంతో గ్రామం నాశనంకావడం ఖాయమని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామంలో కలుషిత నీరు, దుర్వాసన వంటి సమస్యలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రసాయనపరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వారు డిమాండ్‌చేశారు.

## మేడేలో పాల్గొందాం ఐక్య పోరాటాలను ఉధృతం చేద్దాం

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్**

**సదాశివపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

మేడేను దీక్షాదినంగా జరుపుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మేడేను పండుగలా కాకుండా దీక్షాదినంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేడే పోరాటస్ఫూర్తితో పెట్టుబడిదారుల, కార్పొరేట్ మతోన్మాదుల దోపిడీలు, దాడులు, అణచివేతల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడుతూ వర్గ ఐక్యతను సాధించి వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని కార్మికులకు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్మిక వర్గాలు సాధించుకున్న 29 కార్మికచట్టాలను రద్దుచేసి 4లేబర్‌కోడ్‌గా రూపొందించి కార్మిక హక్కులను కాలరాశాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికచట్టాల అమలు కోసం మేడే స్ఫూర్తితో పట్టణ, మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున కార్మికవర్గం ప్రదర్శన సభలో పాల్గొని శ్రమజీవుల ఐక్యత చాటిచెప్పాలని కార్మికవర్గానికి వి.ప్రవీణ్‌కుమార్ సూచించారు.

# అత్యంత పారదర్శకంగా భూసమస్యల పరిష్కారం

**-భూభారతి చట్టంపై అవగాహన**
**-సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**



భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ మను చౌదరి

**మర్కుక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

అత్యంత పారదర్శకంగా రైతులకు, పట్టేదారులకు మేలుజరగాలని జిల్లాస్థాయిలోనే భూసమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకురావడం జరిగిందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు భూభారతి చట్టంలోని వివిధ అంశాల పట్ల జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మేధావులు, ప్రజలు, ఇతరులందరితో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించి 2025 ఏప్రిల్ 14న భూభారతిచట్టం అమలులోకి తెచ్చిందని తెలిపారు. సాదాబైనామాలో తెల్లకాగితం మీద భూవిక్రయాలు జరిగినవాటి గూర్చి భూభారతిలో కొత్తచట్టం తీసుకొచ్చారని, దీనికి సంబంధించిన ప్రక్రియ గూర్చి అధికారులకు మీకున్నసందేహాలు తెలిపితే నివృత్తి చేస్తారన్నారు. రెవెన్యూ రికార్డులో ఒకరిపేరు మీది భూమి ఇంకొకరిపేరుపై రావడం, వారసత్వపరమైన వాటికి ఈ చట్టంలో వెసులుబాటుతో పాటు డాక్యుమెంట్ వెరిఫైచేసి, ఫీల్డ్ ఎంక్వైరీచేసి, ఇరువర్గాలను పిలిపించి ఇద్దరివద్దనడాక్యుమెంట్ వెరిఫైచేసి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించే అవకాశం ఈ చట్టంలో కల్పించారని, భూమికి సంబంధించిన ఎలాంటి విషయాలైనా జిల్లాలో ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్‌స్థాయిలో జరుగుతాయన్నారు. మనిషికి ఆధార్, భూమికి భూదార్‌కార్డు అని భూమిహద్దులు జిపిఆర్ఎస్‌లో పొందుపరిచేవిధంగా పకడ్బందీగా ఈచట్టం ద్వారా భూధార్‌కార్డు ఉపయోగపడుతుందని, దీంతో భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. భూసమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూభారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్ళాల్సి వుండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్‌వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. గ్రామస్థాయిలో మెయింటైన్ చేసే రికార్డ్స్, పట్టేదార్, రైతు, ఇతరులు రికార్డు కావాలని అప్లై చేసుకుంటే నిర్ణీత కాలవ్యవధిలో తీసుకునే వెసులుబాటు ఈచట్టంలో ఉందన్నారు. ఇక్కడికి విచ్చేసిన రైతులు, పట్టేదార్లు, ప్రజా ప్రతినిధుల సలహాలు, సూచనలు అందించిన ప్రతిదీ ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, గజ్వేల్ ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపిడిఓ అశోక్‌కుమార్, ఏఓ వసంతరావు, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు కనకయ్యగౌడ్, కేసిరెడ్డి రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం గౌడ్, జిల్లా నాయకులు బత్తుల మల్లేశం, వంటిమామిడి ఏఎంసి డైరెక్టర్లు ర్యాకం యాదగిరి, పత్తి నర్సింలు, శంకర్‌గుప్త, నాయకులు అరుణ నర్సింలు, సుగుణాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మొండి బిక్షపతి, బాల్‌చంద్రం తదితరులు పాల్గొన్నారు.

### కొమురవెల్లిలో..

**కొమురవెల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

రైతులు భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని అప్పుడే భూసమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్‌తో కలిసి నిర్వహించిన భూభారతి అవగాహనసదస్సులో ఆయనపాల్గొని మాట్లాడారు. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భూభారతిచట్టాన్ని అమలు చేస్తుందన్నారు. వచ్చే నెలనుంచి తహసీల్దార్లు మండలంలోని ప్రతి గ్రామంలో భూభారతి సదస్సులు నిర్వహించి రైతులకు భూసమస్యలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. సదస్సులో ఆర్డీఓ సదానందం, తహసీల్దార్ దివ్య, ఎంపిడిఓ శ్రీనివాస్ శర్మ, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## భూభారతి ద్వారా రైతు సమస్యలకు సులువుగా పరిష్కారం

**-జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి**



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**జోగిపేట, వట్‌పల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

రైతులు ఎదుర్కొనే పలురకాల భూసమస్యలకు సులువుగా పరిష్కారం లభించేవిధంగా భూభారతిచట్టాన్ని రాష్ట్రప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం జోగిపేట, వట్‌పల్లిలలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూభారతి చట్టంలో రైతుల భూములకు సంబంధించి అక్షాంశాలు, రేఖాంశాలకు సంబంధించి భూదార్‌తో పక్కాగా హద్దులు, పటం ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల భూముల సరిహద్దుల గొడవలు తొలగిపోతాయన్నారు. ఈ చట్టంలో అధికారాల వికేంద్రీకరణ, ఫౌతికోసం నోటీసు విధానం, సత్వర న్యాయసేవలు అందుబాటులో ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ధరణిలో జరిగిన పొరపాట్ల వల్ల చాలామంది రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రతిరోజు తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, అయినా తమ సమస్యలు పరిష్కారం అవక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆమె అన్నారు. భూభారతి చట్టంలో అలా రైతులు ఇబ్బందులు లేకుండా చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఇందుకోసం నిపుణులతో కమిటీవేసి పలురాష్ట్రాల్లో అమలవుతున్న తీరును పరిశీలించి రైతులకు సులువైన విధానాలను అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. భూభారతి చట్టంపై అవగాహనకు రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రైతు సదస్సులు నిర్వహిస్తున్నారని, ఇందులో రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారని అన్నారు. వీటన్నింటిపై సమగ్రంగా పరిశీలనచేసిన అనంతరం భూభారతి చట్టంలో పొందుపరచడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూభారతి చట్టంతో రైతుల భూములకు పటిష్టరక్షణ కలుగుతుందని, రైతుబీమా,రైతుభరోసా, బ్యాంకు రుణాలు కూడా వస్తాయన్నారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు, తహసీల్దారు ఉమాశంకర్, డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, జోగిపేట మార్కెట్‌కమిటీ ఛైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, వట్‌పల్లి తహసీల్దారు శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్ గీత, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వట్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కొప్పుల లక్ష్మి, ఆత్మ కమిటీ ఛైర్మెన్ కచ్చురావు, వట్‌పల్లి తహసీల్దారు శ్రీనివాస్, ఏడిఏ సత్యనారాయణలతోపాటు నాయకులు పాల్గొన్నారు.

## సాగునీటి కాలువను ధ్వంసం చేసిన ఇథనాల్ కర్మాగారంపై చర్యలు తీసుకోవాలి



కాలువను పరిశీలిస్తున్న నాయకులు

**బెజ్జంకి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

శనిగరం చెరువుల నుంచి ముత్తన్నపేట గ్రామానికి సాగు నీరు నిమిత్తం ఉన్న కాలువను ధ్వంసంచేసిన ఇథనాల్ కర్మాగారంపై చర్యలుతీసుకోవాలని మంగళవారం బిఆర్ఎస్,సిపిఎం పార్టీ నాయకులు ముత్తన్నపేట గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, సిపిఎం పార్టీ మండలకార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్‌నాయకులు, రైతులతో కలిసి ధ్వంసమైన కాలువను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి కాలువను ధ్వంసంచేసి అదే కాలువలోకి కర్మాగారం నుంచి వెలువడే మురుగునీటిని విడుదల చేస్తున్నారని ఒకవైపు సాగుకు నీరందక రైతులు పంటలను నష్టపోతుంటే ఇథనాల్‌కర్మాగార యాజమాన్యం కాలువలోకి మురుగునీటిని వదిలి రైతుల పంటపొలాలను నాశనంచేయడమే కాకుండా గ్రామస్థుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఈకంపెనీలనునిర్మిస్తున్నారని కంపెనీ అనుమతులు రద్దు చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపెనీపై కఠినచర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయాపార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్ నూతన తహసీల్దార్‌గా నిర్మల

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

జగదేవ్‌పూర్‌మండల నూతనతహసీల్దార్‌గా ఎస్.నిర్మల మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హైద్రాబాద్‌లో సిసిఎల్‌ఏ కార్యాలయంలో సూపరిండెంట్‌గా పనిచేసిన తాను జగదేవ్‌పూర్ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

## పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహణ

**-అదనపు కలెక్టర్ నగేష్**





లాటరీ టోకెన్‌ని బాక్స్‌లో వేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

మెదక్ బార్‌అండ్‌రెస్టారెంట్ నిర్వహణకు అత్యంత పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగా మెదక్ పట్టణంలో గత మూడు సంవత్సరాలుగా మూతబడి ఉన్న బార్‌అండ్‌రెస్టారెంట్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సమక్షంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ ప్రజావాణి హాల్ నందు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్ అధ్యక్షతన లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ముందుగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి బార్‌అండ్‌రెస్టారెంట్ నిర్వహణకు సంబంధించి దరఖాస్తుదారులకు తగుసూచనలు సలహాలు లాటరీప్రక్రియ నియమనిబంధనలను వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్, డిప్యూటీ కమిషనర్ హరికిషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఎక్సైజ్ సిబ్బందితో పాల్గొని అదనపు కలెక్టర్ లాటరీతీసి విజేత నెంబర్14 హైదరాబాద్ వాసి శోభ విజేతగా ప్రకటించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ బార్‌అండ్‌రెస్టారెంట్ నిర్వహణకు 20 మంది దరఖాస్తులు సమర్పించారని దరఖాస్తుదారుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో, బార్‌లు, రెస్టారెంట్‌లకు మద్యం లైసెన్సులు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం లాటరీ వ్యవస్థను ఉపయోగిస్తుంది. లైసెన్స్‌లను జారీ చేయడంతో సహా, లాటరీవ్యవస్థ అనేది మద్యంలైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలకు నిష్పక్షపాతంగా, యాదృచ్ఛికంగా ఒక అవకాశాన్ని కేటాయించే ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ..

మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ఏర్పాటుచేసిన రోడ్డుభద్రత జిల్లాస్థాయి నెలవారి సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డుభద్రత అనేది అత్యంత ప్రాధాన్యమైనదని, మానవ తప్పిదాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాదాలలో 18నుంచి 45సంవత్సరాల లోపువారే ఎక్కువగా చనిపోతున్నారని, వీటిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే 161,44,165,765లపై పోలీస్‌శాఖ అధికారుల ద్వారా కనుగొన్న బ్లాక్ స్పాట్ల వద్ద రేడియం స్టికర్లతో కూడిన సూచికలను ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రహదారులపై అవసరమైన చోట వాహనవేగాన్ని నియంత్రించే స్పీడ్‌బ్రేకర్స్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, పాదచారులు రోడ్డు దాటేదగ్గర జీబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్డు రిఫ్లెక్టింగ్ లైట్లు, తమ వాహనం ఎంత వేగంతో వెళ్తున్నది వాహన చోదకుడిని అలెర్ట్ చేసేలా రోడ్లపై వేగాన్ని సూచించే డిజిటల్‌బోర్డులను ఏర్పాటుచేయాలని, అన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు పురోగతిపై నేషనల్ హైవే, పోలీస్, ఆర్‌అండ్‌బి అధికారులతో చర్చించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బిఈ సర్దార్‌సింగ్, డిఎస్పీ ప్రసన్నకుమార్, నేషనల్ హైవే కన్సల్టెంట్లు కాంట్రాక్టర్లు, పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజు

**కొమురవెల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి భాగ్యమ్మ(62) తెల్లవారుఝామున 4గంటలకు రోజు మాదిరిగానే గుడి దగ్గరికి వెళ్లి దండం పెట్టుకొని తిరిగివచ్చి తనదుకాణం తీస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మెడలోంచి 5తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్ఐ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## హరితహారంలో నాటిన మొక్కలు ధ్వంసం

**రాయపోల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా పచ్చదనాన్ని పెంచేందుకు వందల కోట్లు ఖర్చు పెట్టి తెలంగాణ ప్రభుత్వం మొక్కలు నాటించింది. అయితే కొందమంది ఈకార్యక్రమాన్ని నీరుగారుస్తున్నారు. రాయపోల్ మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో హరితహారంలో భాగంగా నాటిన దాదాపు 10కి పైగా మొక్కలను గుర్తుతెలియని దుండగులు నరికివేశారు. మొక్కలను నరికిన వారిని గుర్తించి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వీరారెడ్డిపల్లిలో నరికివేసిన మొక్కల దృశ్యం

## అదృశ్యమైన తెనుగు అంజన్న

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

కిరాణా సామగ్రి తీసుకువస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలపరిధిలోని ముక్తాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ బి.సాయిలు కథనం ప్రకారం.. ముక్తాపూర్ గ్రామానికి చెందిన తెనుగు అంజన్న (42)ఈ నెల 28వ తారీఖున ఉదయం 10గంటల ప్రాంతంలో కిరాణా సామగ్రి తీసుకువచ్చేందుకు నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌కు వెళ్లాడన్నారు. రాత్రి అయినా అంజన్న ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనంలేకుండాపోవడంతో అదృశ్యమైన అంజన్నభార్యసావిత్రి మంగళవారం ఫిర్యాదుచేయగా కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎస్ఐ పేర్కొన్నారు. ఆచూకీకానవస్తే 7893492520/8712656762కు సమాచారం అందించాలని ఎస్ఐ సాయిలు వివరించారు.



ప్రముఖులను సత్కరిస్తున్న డాక్టర్ పసుమర్తి శేషబాబు,

## సామాజిక సేవలందిస్తున్నవారిని గౌరవించాలి

### కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ పసుమర్తి శేషబాబు

**చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త:** సమాజంలో వివిధ సేవలందిస్తూ పురస్కారాలు అందుకున్న వారికి మరింత బాధ్యతను పెంచుతాయని యక్ష గాన కంఠీరవ, ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ పసుమర్తి శేషబాబు అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి, ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా 'స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్ట్-2025' కార్యక్రమం జరిగింది. బాల బాలికలను నాట్య, కళారంగాలలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు 'గౌరవ ఆత్మీయ సన్మాన'కార్యక్రమం, పలురంగాలవారికి 'ఆల్ ది బెస్ట్ అవార్డులు', నాట్యగురువులకు 'నాట్యగురు రత్న అవార్డులు', నాట్యకళాకారులకు 'నట రాజు మోమెంటో', గోల్డ్‌మెడల్, సర్టిఫికేట్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ స్థాపక అధ్యక్షుడు ఇఎస్.సూర్యనారాయణ మాస్టారు, ప్రధాన కార్యదర్శి ఇ.సూర్యతేజ సూబ్రాంత్ మాస్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పసుమర్తి శేషబాబు హాజరై నిస్వార్ధంగా సేవలకుగాను పురస్కారాన్ని అందించారు. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ మాస్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఖ్య శాస్త్ర నిబంధనలు దైవజ్ఞ శర్మ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మందడి కృష్ణారెడ్డి, పి.ఉమా శంకర్‌రెడ్డి, కేంద్ర ఫిలింసెన్సార్‌బోర్డు సభ్యుడు పి.కృష్ణాదిశేషు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ నైనాదేవి, డాక్టర్ కె.యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

## విఎస్‌టి కార్మికుల కోసం ఎసి బస్సులు ప్రారంభం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 29ప్రభాతవార్త:** విఎస్‌టి కార్మికులకు గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాజీఎంపీ, ఐఎన్‌టిసి జాతీయ అధ్యక్షులు విఎస్‌టి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి సంజీవరెడ్డి దశలవారీగా అమలు చేస్తున్నారని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్‌టి వర్కర్స్ యూనియన్ సలహాదారులు ఆర్డీ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం కార్మికులు ప్రతిరోజు నగరంలోని అజాబాదులోని జీఎస్టీ నుంచి తూప్రాన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంపెనీకి వెళ్లి వచ్చేందుకు ఏర్పాటు చేసిన ఐదు ఏసీ బస్సులను మంగళవారం విఎస్‌టికంపెనీ గేటువద్ద పూజచేసి ఆర్‌డి చంద్రశేఖర్, యూనియన్ సలహాదారుడు కే.రాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ డి పాల్, చీఫ్ ఉపాధ్యక్షులు జి నాగేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016లో తూప్రాన్ కు కంపెనీకి చెందిన పిఎండి విభాగం తరలించబడిందని చెప్పారు. అప్పటినుంచి దశలవారీగా పంపిన మొత్తం తాలిపోయిందని చెప్పారు. ప్రయాణము సులభంగా ఉండేందుకు తమకేసి బస్సులు కావాలని అప్పటి యూనియన్ అధ్యక్షుడు వి శ్రీనివాస్ రెడ్డికి కార్మికుల విన్నవించిన పట్టించుకోలేదని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాము గెలిస్తే ఏసీ బస్సులు కంపెనీ చేత ఏర్పాటు చేస్తామని ఈ సంజీవరెడ్డి హామీ ఇచ్చారని ఈ మేరకు అది అమలు చేశామని వారు చెప్పారు. ఏసీ బస్సుల వల్ల కార్మికులు సుఖంగా ప్రయాణం చేసి ఇంటికి చేరుకుంటారని చెప్పారు. ఏసీ బస్సుల ఏర్పాటుతో కార్మికులత సంతోషంగా ఉన్నారని చెప్పారు ఈ కార్యక్రమంలోనాయకులు ప్రభాకర్ నవీన్ రణధీర్ రెడ్డి విజయ్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు రాహుల్‌గాంధీ ప్రశంసలు



రాహుల్ గాంధీతో ప్రదర్శనలో పాల్గొన్న గడ్డం సరోజా వివేక్, గడ్డం వివేక్ వెంకటస్వామి తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, ప్రముఖ ఔత్సాహిక పారిశ్రామికవేత్త గడ్డం సరోజావివేక్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశంసలు అందుకున్నారు. పారిశ్రామికరంగంలో విశేషంగా ప్రతిభకనబరుస్తుండడం విశేషమని ప్రశంసించారని సరోజావివేక్ అన్నారు. మంగళవారం ఇందులో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేతుల మీదుగా ప్రారంభించిన విశాఖ ఇండస్ట్రీస్ నూతనంగా ఆటమ్ సోలార్ రూఫ్, ఆటమ్ చార్జింగ్ స్టేషను, ఆటమ్ ఈబైక్ ఏర్పాటుచేసిన విధానాన్ని రాహుల్‌గాంధీ ప్రశంసించారన్నారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని పురోగమింపజేసే దిశగా పురోగమించడం శుభపరిణామం అని, భారతదేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని, గ్రీన్ మోబిలిటీ పరిష్కారాలను వేగవంతం చేసే దిశగా ఒక కీలక ముందడుగు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చేపడుతున్న పర్యావరణ అనుకూలమైన, ఆవిష్కరణాత్మక దృష్టిని ప్రతిబింభించాయి. కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి లోకసభ సభ్యుడు, విశాఖ ఇండస్ట్రీస్ జెఎండి వంశీ గడ్డం పాల్గొన్నారు.

## అడిక్‌మెట్ డివిజన్‌లో బిజెపి నేతల పాదయాత్ర



సమస్యలను తెలుసుకుంటున్న సాయికృష్ణయాదవ్ తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** బిజెపి అడిక్‌మెట్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ సూచనల మేరకు డివిజన్‌లోని వడ్డెర బస్తిలోని అంగన్వాడి సెంటర్, బస్తీ దవాఖాన కేంద్రాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. అంగన్వాడీ కేంద్రం పరిసరాల వద్ద ఉన్న చెత్త కుప్పపై అధికారులతో మాట్లాడి దానిని తక్షణం తొలగించవలసిందిగా కోరారు. అదే విధంగా అంగన్వాడి కేంద్రం, బస్తీ దవాఖాన వద్ద నీటి సమస్య, విద్యుత్ వైరింగ్ సమస్య ప్రధానంగా ప్రస్తావించారు. సమస్యలను కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి ద్వారా అధికారులతో సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేయడానికి కృషి చేస్తామని వారికి వివరించారు. . ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, నగర నాయకులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ కాలనీలో మజ్జిగ పంపిణీ...

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

దాసరి శ్రీనివాసరావు, ప్రసన్న జ్ఞాపకార్థంగా, కెపిహెచ్‌బిలోని భాగ్యనగర్ కాలనీలో రాహుల్ దాసరి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హోప్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండా విజయ్ ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విజయ్ మాట్లాడుతూ వేసవి తాపాన్ని తీర్చేందుకు ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినంద నీయమని, రాహుల్ దాసరి మిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. మరెన్నో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని వారిని ప్రోత్సహిం చారు. వేసవి కాలంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఆర్కె దయాసాగర్, శ్రీనివాస్ యాదవ్, హరికుమార్, హరికృష్ణ, సతీష్ నాయుడు, బుల్లెట్ రవి, రవీందర్, రాకేష్, అర్జున్ పాల్గొన్నారు.

# సాంస్కృతిక రంగాలలో చేసిన సేవలకు గుర్తింపు కావాలి

**శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్**




పురస్కారాలను ప్రదానం చేస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:**

సాంస్కృతిక రంగాలలో వివిధ రకాల సేవలు చేసినవారిని గుర్తించి గౌరవించటం అవసరం అని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ చాన్స్‌లర్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. వారిని సత్కరిస్తున్న రసమయి సంస్థకు అభినందనలు తెలిపారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రసమయి ప్రముఖ సాంస్కృతిక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాము నిర్వహణలో సాంస్కృతిక రంగంలో వివిధ ప్రక్రియలులో కృషి చేస్తున్న పి ఎస్ కోటేశ్వర రావు,రామరాజు లక్ష్మీశ్రీనివాస్, డాక్టర్ కావూరి శ్రీనివాస్,పి.ఖదీర్‌బాబు, డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి, డాక్టర్ కె.వి.జ్ఞానకుమార్‌లను ఆచార్య ఇనాక్ అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ రసమయి సంస్థ గత ఏభై ఏడుఏళ్లుగా విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ జీవితానికి సార్ధకత సాహిత్యం కళలను ఆరాధించటం అన్నారు. రసమయి రాము జీవితం ధన్యమన్నారు. విశ్రాంత ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహాప్ప, గనులు, భూగర్భ శాఖ రిటైర్డ్ డైరెక్టర్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వి డి రాజగోపాల్ పాల్గొన్న సభకు డాక్టర్ ఎంకె రాము స్వాగతం పలికగా ఆశాలత వ్యాఖ్యనం చేయగా తొలుత లక్ష్మీ శ్రీనివాస్ వీణా వాదన ఆకట్టుకుంది



వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## కార్మికులకు వెల్ఫేర్ కార్డు అందించాలి

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** టిపిసిసి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గం లేబర్ సెల్ అధ్యక్షులు సప్పిడి భాస్కర్ మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి ప్రజా వ్యవహారాలు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి టిపిసిసి లేబర్ సెల్ ఐఎన్‌టియూసి తరపున కార్మికులకు బిఒసిడబ్ల్యూ వెల్ఫేర్ కార్డు అందించేలా వినతిపత్రం అందించారు. తెలంగాణలో చాలా మంది మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి పనిచేస్తున్న అర్హులైన గృహనిర్మాణ కార్మికులకు, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం, వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనాలు సంబంధించి 1996 సంవత్సరంలో అప్పటి ప్రధాన మంత్రి దేవే గౌడ, ఇంచార్జ్ కేంద్ర కార్మిక శాఖ మంత్రి రవీంద్ర వర్మ కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల భీమా పథకం బిఒసిడబ్ల్యూ వెల్ఫేర్ బోర్డ్ లోకసభలో చట్టం తీసుకొచ్చారు. చాలా మంది నిర్మాణ రంగ కార్మికులకు బిఒసిడబ్ల్యూ వెల్ఫేర్ కార్డు ప్రయోజనాల గురించి అవగాహన లేక ఎంతో మంది అర్హులైన నిర్మాణ రంగ కార్మికులు నష్టపోయారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా కార్మిక చట్టంలో మార్పు చేసి బిఒసిడబ్ల్యూ వెల్ఫేర్ బోర్డ్‌లో అర్హులైన ప్రతి ఒక్క నిర్మాణ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని అలాగే భవన నిర్మాణ ఇతర నిర్మాణ యజమానులకు, డెవలపర్స్, కాంట్రాక్టర్స్, బిల్డర్స్‌లకు సంబంధిత శాఖల ద్వారా ప్రత్యేక షరతులు విధించి అర్హులైన ప్రతిఒక్క గృహ నిర్మాణ కార్మికుడికి కచ్చితంగా బిఒసిడబ్ల్యూ వెల్ఫేర్ కార్డు ఉంటేనే పని తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## నూతన కార్యవర్గం ఏర్పాటుకు బిజెపి సమావేశం

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** 129 డివిజన్ సూరారంలోని ఉషోదయ టవర్స్ బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు కేశవ్ యాదవ్ అధ్యక్షతన నూతన కార్యవర్గం కోసం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి బాలానగర్ బిజెపి నాయకులు సురేందర్‌రెడ్డి అబ్జర్వరగా విచ్చేశారు. కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, రవి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, పద్మయ్య, దీపక్, దాసు, నర్సింహా రావు, దయాసాగర్, సీనియర్ నాయకులు తదితర నాయకులు పాల్గొని చర్చించి నూతన కార్యవర్గానికి పేర్లను అబ్జర్వర్ కి ఇవ్వడం జరిగింది.

## హిందీ తెలుగు పాటలతో ఆకట్టుకున్న గాయకులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** దొరవో ఎవరివో అంటూ జిఎస్ఆర్ రుక్మిణీతో అరుదుగా వినిపించే పాటను మధురంగా గానం చేసి శ్రోతలను ముగ్ధులను చేశారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా దీక్షి తులు కళా వేదిక పై జి ఎస్ అర్ అండ్ ఫ్రెండ్స్ నిర్వహణ లో పిల్లలూ దేవుడూ చల్లని వారే శీర్షికన తెలుగు హిందీ చిత్రాల లోని గీతాలు ఆలపించారు సత్య వతి త్రినాథ రావు దివ్య కార్తీక పద్మజ అరుణ రామ మూర్తి రామ కృష్ణ తదితరులు పలు పాటలు ఆలపించారు సభా కార్యక్రమంలో సంస్థ స్థాపకుడు జి ఎస్ అర్ స్వాగతం పలుకుతూ తమ సంస్థ తొలి వార్షిక వేడుకలు సందర్భం గా గట్టుపలి చెంచు రామా రావు స్మారక సంగీత నగదు పురస్కారాలు గోళ్ళమూడి శ్రీ శ్రియ, గొల్లమూడి శ్రీ వల్లీ లకు 2025 కు అందజేస్తున్నామనీ తెలిపారు ముఖ్య అతిథిగా ప్రముఖ గాయకుడు త్రినాథ రావు పాల్గొని పురస్కారాలు బహుకరించి మాట్లాడుతూ తండ్రి పేరిట జి ఎస్ అర్ నగదు పురస్కారాలు ఏర్పాటు చేయటం తల్లి తండ్రుల పట్ల ఆయనకున్న గౌరవం ఉత్తమ సంస్కారం అని అభినందించారు.



గానం చేస్తున్న గాయనీ గాయకులు



ఎసిపి శంకర్‌రావుకు జ్ఞాపికను అందిస్తున్న సైనికాధికారి

## రోడ్డు భద్రతపై అగ్నివీర్‌లకు అవగాహన

**అల్వాల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రోడ్డు నియమ నిబంధనలకు సంబంధించి నార్త్‌జోన్ ఎసిపి శంకరరావు అగ్నివీర్‌కు అవగాహన కల్పించారు. సికింద్రాబాద్ ఎఒసి సెంటర్‌లో శిక్షణలో ఉన్న అగ్నివీర్‌లకు రోడ్డు భద్రతపై పలు సూచనలు, సలహాలు అందించారు. దేశ రక్షణలో ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండే సైనికులు అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదాలకుగల కారణాలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇరువురు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తనతో పాటుగా ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురి చేయడం జరుగుతోందన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ కూడా ప్రమాదాలకు కారణంగా ఉందని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఇందుకుగాను మూడు నెలలు జైలుశిక్షతో పాటు అపరాద రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంద్వారా ప్రమాదాలు జరుగు తున్నాయని వివరించారు. మోటార్ వెహికిల్ చట్టాలకు సంబంధించి ఎసిపి శంకరరావు అగ్నివీర్‌లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ ఎడి శర్మ, సుబేదార్ మేజర్ బోర్కర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ ఎస్ఐ శ్రీధర్‌లుతో పాటుగా సుమారు 300 మంది అగ్నివీర్‌లు పాల్గొన్నారు.

## తెలుగుభాషా సాహిత్యానికి నండూరి కృషి చిరస్మరణీయం





సాహిత్య పురస్కారంతో విజయలక్ష్మిని సత్కరిస్తున్న వసుంధర తదితరులు

**నాంపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** పద్యకవిగా, అధికార భాషాసంఘ అధ్యక్షుడిగా తెలుగుభాషా ప్రాచుర్యానికి, తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన డా. నండూరి రామకృష్ణమాచార్యులు చిరస్మరణీయులని తెలంగాణ రాష్ట్ర ఖనాజా లెక్కలశాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర అన్నారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషానిలయంలో నవ్యసాహితీ సమితి, నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన డా. నండూరి రామకృష్ణమాచార్య 105వ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వసుంధర సమితి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర, గౌరవ అతిథులు డా. ఆర్. అనంతపద్మనాభరావు, కె.సాగర్‌రావు, వేమరాజు విజయకుమార్, గోవింద రాజులు, విద్యారణ్యస్వామి, గాంధీ తదితరులతో కలిసి నండూరి చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి ప్రసంగించారు. పద్యకవిత్వం పునరుజ్జీవనానికి సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 జిల్లాలలో ఆంధ్ర పద్య కవితా సదస్సును ఏర్పాటుచేసిన మహనీయుడు ఆయనని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థ పక్షాన ప్రముఖ కవయిత్రి డా. పులిగడ్డ విజయలక్ష్మిని ఘనంగా సత్కరించి నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పురస్కారం ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు. సభకు ఫణీంద్ర స్వాగతం పలుకగా విజయకుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.




అమీర్‌పేట్‌లో ఇంటర్నేషనల్ జూవెలరీ ఎగ్జిబిషన్‌పై జరిగిన సమావేశంలో పాల్గొన్న బంగారం వ్యాపారస్తులు

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: ఎమ్మెల్యే



ఖానాపూర్‌లో కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీత వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో 500 గజాల స్థలంలో రూ.2.కోట్ల 93లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముంగి జైపాల్‌రెడ్డి, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ రామేశ్వరం నర్సిహాతోకలిసి ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా జల మండలి అధికారులతో మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. ప్రజల మధ్యనే ఉండడం వలన ప్రజలు నాపై విశ్వాసం ఉంచి వరుసగా నాలుగో సారి రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. ప్రజలు నావెంట ఉన్నారని, ప్రజల కోసం నేనుంటానని పేర్కొన్నారు. పనిచేసే నాయకులను ప్రజలు ఎప్పుడు అక్కున చేర్చుకుంటారని, ఓట్లేసి గెలిపించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, సహకార సంఘం చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ, మాజీ కౌన్సిలర్లు ఉషారాణి, దుర్గేష్ యాదవ్, పత్తి ప్రవీణ్, నాయకులు గండయ్య ముదిరాజ్, ధర్మపురి, కిషన్, రాము, దశరత్‌యాదవ్, రేఖ, ఓంప్రకాశ్‌రెడ్డి, హరిశంకర్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ప్లాట్లు అలాట్‌చేయాలి

### కొంతం దీపిక

**కంటోన్మెంట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అలాట్ చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లక్రితం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అలాట్‌చేయకపోవడంతో అద్దెలు చెల్లించలేక ఫ్లాట్లు కేటాయించకపోవడంతో మానసిక ఆవేదనకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు పడుతున్న బాధలను ప్రభుత్వం గుర్తించి సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేష్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చొరవ తీసుకొని 15 రోజుల్లోగా ఫ్లాట్లు అలాట్‌చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలి : తేలుకుంట

**కంటోన్మెంట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** సికింద్రాబాద్, ప్యాట్నీ, జెబిఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం భూ సేకరణలో బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా తగు న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త, రాజీవ్ రహదారి స్థలాల జేఏసి చైర్మన్ తేలు కుంట సతీష్‌గుప్త తెలిపారు. మంగళవారం 7వ వార్డు తిరుమలగిరి టీచర్స్ కాలనీలో హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్,ల్యాండ్ అక్వియేషన్ డిప్యూటీ కలెక్టర్ అపర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో స్థలాలు కోల్పోతున్న వారి అభిప్రాయాలను సేకరించి వారి డిమాండ్లను రెవెన్యూ అధికారుల దృష్టికితెచ్చారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో, రోడ్డు విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితు లకు మార్కెట్ రేట్‌కు అధికంగా డబ్బులు చెల్లించాలన్నారు. రోడ్డు వెడల్పుకు 200 ఫీట్ల నుంచి 120 ఫీట్లకు కుదించాలని అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో తిరుమలగిరి తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను అరెస్టు చేయడం అన్యాయం

**సైఫాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ టీచర్ల అక్రమ అరెస్టులను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణకుమారి తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఉదయం 5 గంటల కు ఫిర్జాదిగూడలో ఉన్న యూనియన్ రాష్ట్ర కోశాధికారి ప్యారీజాన్ ఇంటికి పోలీసులు వెళ్ళి అక్రమంగా అరెస్టు చేసి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఆమె ఖండించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలాంటి ఆందోళనలకు పిలుపు ఇవ్వక పోయినా, ఇతరులు ఇచ్చిన పిలుపుకు ఎఐటియుసి అసోసియేషన్ నాయకులను వివిధ ప్రాంతాలలో అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అర్థరాత్రి మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని మానుకోవాలని, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో తమ యూనియన్ ఆందోళనలు చేపట్టవలసి వస్తుందని ఆమె హెచ్చరించారు.

## ఉగ్రవాదంపై కేంద్రం తీసుకునే చర్యలకు లోక్‌దళ్ మద్దతు

**సైఫాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** దేశ రక్షణ కోసం ఉగ్రవాదులను అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంపూర్ణంగా భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ మద్దతు ప్రకటించింది.ఇప్పటికే కొన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయని, మిగిలిన పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, యువజనులను, విద్యార్థులు మద్దతు ప్రకటించాని పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు విజ్ఞప్తిచేశారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన బుద్దివచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ముందుకు పోవాలని ఆయన కోరారు. పాకిస్తాన్‌తో దశాబ్దాల తరబడి దేశం అభివృద్ధిలో కుంటుపడుతున్నదని ఇక సహించాల్సిన అవసరం లేదన్నారు. ప్రశాంతంగాఉన్న కశ్మీర్‌లో ఉగ్రవాదులు 28 మంది ప్రాణాలను బలిగొరడం క్షమించరాని విషయమన్నారు. మృతి చెందిన పర్యాటకులకు సానుభూతిని తెలియజస్తూ, గాయపడినవారు త్వరగా కోలుకోవాలన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం..

**దుండిగల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** ఏఐసీసీ, సిడబ్ల్యూసి అగ్ర నాయకుల సమావేశంలో తీసుకున్న సంఘటీత్ సాల్‌లో భాగంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ పునరనిర్మాణం, కాంగ్రెస్ పార్టీ బలోపేత నిర్ణయాల నేపథ్యంలో మంగళవాకం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్‌పల్లి, మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ అబ్జర్వర్స్ పారిజాత నర్సింహా రెడ్డి దుర్గం భాస్కర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిల అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. అనంతరం జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అమాయకపు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది, ప్రతి కార్యకర్త పదవుల కోసం కాకుండ పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. పార్టీ సంస్థాగత నిర్మానంలో, కమిటీల ఏర్పాటులో క్షేత్రస్థాయిలో పరిశీలించి బస్తి స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ ప్రతిష్టాత్మక నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనాయకులు సోనియగాంధీ, మల్లిఖార్జున్‌ఖార్గే, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో సిడబ్ల్యూసి సమావేశంలో సంఘటీత్ సాల్‌లో భాగంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ పునరనిర్మాణం, కాంగ్రెస్ పార్టీ బలోపేత నిర్ణయాలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు ఉన్నత పదవులు దక్కేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** ఆరోగ్య సమస్యలతో ఓ వ్యక్తి మనస్థాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఏనుగుల రాజశేఖర్(43) ఈ నెల 27వ తేది సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుండి వాకింగ్‌కు అని వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో వెన్నెలగడ్డలోని చెరువులో ఓ వ్యక్తి శవం కనిపించింది. పోలీస్ వారు రాజశేఖర్ కుటుంబ సభ్యులకు తెలుపగా మృతుని భార్య, సోదరుడు మృతుని గుర్తించి ఏనుగుల రాజశేఖర్ అని ధృవీకరించారు. అయితే రాజశేఖర్‌కు 8 నెలల క్రితం కంటి ఆపరేషన్ జరిగింది. అతను డయాబెటిక్ పేషంట్ కావడంతో కంటి ఆపరేషన్ ఫెయిల్ అయ్యింది. ఇంట్లో ఉండడంతో డిప్రెషన్‌కు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు సోదరుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** ఇటుకల బట్టీలో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా నుండి జీవనోపాధి కోసం తన కుటుంబంతో కలిసి కాపూర్ చాన్ కట్ట (32) హైదరాబాద్‌కు వచ్చి గుండ్లపోచంపల్లిలో నివాసం ఉంటున్నాడు. సుమారు 4 నెలల క్రితం గుండ్లపోచంపల్లి శివారడులోని నూజివీడు సీడ్స్ బ్యాక్ సైడ్ గల ఇటుకల బట్టీలో పనిలో చేరాడు. రోజులాగే మంగళవారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో ఇటుకలు తయారీ కోసం మట్టిని నీటితో తడపడానికి మోటర్‌ను వేసి బంద్ చేయడం కోసం వెళ్ళినపప్పుడు విద్యుత్ షాక్ తగిలింది. ఇటుకల బట్టి యజమాని సాంబశివరావు నిర్లక్ష్యంగా మోటార్‌ని తడి ప్రదేశంలో పెట్టడం వల్ల ఈ విద్యుత్ షాక్ జరిగిందని కుటుంబ సభ్యులు ఓనర్‌పై కేసు నమోదు చేశారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

-ఎఐసిసి నాయకులు, ఎంపి విశ్వనాథన్



ఎఐసిసి నాయకులు, ఎంపి విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:**
కష్టకాలంలో పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికే నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని ఎఐసిసి నాయకులు, ఎంపి విశ్వనాథన్ అన్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న క్రమంలో మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయం వచ్చారు. ఈసందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఘన స్వాగతంపలికారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో విశ్వనాథన్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. మాజీ సిఎం కెసిఆర్ కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను పార్టీశ్రేణులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నేటి వరకు ఆరు గ్యారెంటీల అమలుతోపాటు అనేక సంక్షేమపథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జిగా పూజల హరికృష్ణ బాగాపనిచేస్తున్నారని కితాబిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, పూజల గోపికృష్ణ, ఎల్లం యాదవ్, యాదగిరి, వహీద్‌ఖాన్, సాంబమూర్తి, కలీం, సతీష్ పాల్గొన్నారు.

## మేడే గోడపత్రిక ఆవిష్కరణ




మేడే కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐటియుసి నాయకులు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
మే 1న నిర్వహించే మేడేను పురస్కరించుకుని బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్ ఏఐటియుసి యూనియన్ కార్యాలయంలో మంగళవారం మేడే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు, ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోడీకి గుణపాఠం చెప్పాల్సిన ఆవసరం ఆసన్నమైందన్నారు. మే 20న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాల్సిన అవసరం కార్మికులు, ప్రజలపై ఉందని గుర్తుచేశారు. నింగికంటుతున్న నిత్యావసర వస్తువులు ధరలు, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో, జిఎస్టీ పన్నులతో సామాన్య మానవుల నడ్డి విరుస్తున్నారని ప్రధానమంత్రిపై మండిపడ్డారు. మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు, జిల్లా సహాయకార్యదర్శి ప్రవీణ్, రవి, భగత్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే

-ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరిక



వాహనచోదకుడికి బ్రీత్ అనాలసిస్ చేస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
మద్యం సేవించి వాహనాలు తోలితే జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదని ఎస్సై వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలపరిధిలోని శివాజీ చౌక్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. అటుగా వెళుతున్న వాహన చోదకులకు బ్రీత్ అనాలసిస్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యంసేవించి వాహనాలుతోలితే ప్రమాదాలుజరిగే అవకాశాలు ఉంటాయని, ప్రమాదంలో తమతోపాటు ఎదురుగా వచ్చే వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంటుందని, ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయని గుర్తుచేశారు. మద్యంసేవించి వాహనాలు తోలకూడదని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని వాహన చోదకులకు ఎస్ఐ హితవు పలికారు.

## జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్పునకు అంగీకారం

-ఎంపి రఘునందన్‌రావు కృషితో భూములుకోల్పోతున్న రైతులకు ఊరట



జాతీయ రహదారులశాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సూర్యపేట-సిద్దిపేట మీదుగా సిరిసిల్లకు వెళ్లే 365 బి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. ఈరహదారి ప్రాజెక్టు వలన పలు గ్రామాల్లో రైతులు విలువైన సాగుభూములు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రైతులతరపున మెదక్‌ఎంపి మాధవనేని రఘునందన్‌రావు చొరవతీసుకొని రైతుల ప్రతినిధిబృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ రహదారులశాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. దుద్దెడ, ఎన్సాన్‌పల్లి, మర్పడ్గ, బూర్గుపల్లి, ఖమ్మంపల్లి, తకడ్కపల్లి, చిన్నగుండవెల్లి, పుల్లూరు, మల్యాల గ్రామాల్లో రైతులు కోల్పోతున్న భూముల వివరాలను అధికారికి వివరించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువల నిర్మాణంకోసం ఇప్పటికే భూములనుకోల్పోయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారికి వివరించారు. రైతుల భూములకు నష్టం లేకుండా రాజీవ్ రహదారి, సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసే మార్గాన్ని ప్రతిపాదించారు. ప్రస్తుతం జరుగుతున్న భూ సర్వేను తాత్కాలికంగా నిలిపి వేసి కొత్త అలైన్‌మెంట్ ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులకు ఊరట లభించింది. రైతుల పక్షణ న్యాయం జరగానికి కృషి చేసిన ఎంపి రఘునందన్‌రావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, నాయకులు చింత సంతోష్ తదితరులు ఉన్నారు.

# మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీట్ సెంటర్

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
మే 4న జరగనున్న నీట్ (ఎన్‌టిఎ-నీట్) పరీక్షకు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌నందు జరిగిన సమీక్షాసమావేశంలో అదనపుకలెక్టర్ నగేష్‌తోపాటు రెవెన్యూ, పోస్టల్, ఎలక్ట్రిసిటీ, పోలీస్, విద్య,వైద్య శాఖ అధికారులు, పలువురు ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, మెదక్ జిల్లా హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నీట్ పరీక్ష సెంటర్ కేటాయించడం జరిగిందని 487మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు. మే4వతేదీ మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షాకేంద్రాల్లో త్రాగునీరు, నిరంతర విద్యుత్, శానిటేషన్, తరగతి గదుల శుభ్రత, బెంచీలు, బస్ సదుపాయం వంటి మౌలిక సదుపాయాలన్నీ ఈనెల 30వ తేదీ లోపు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షాసమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, యుజిసినీట్ సిటీ కోఆర్డినేటర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.హుస్సేన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, డిఎస్పీ ప్రసన్నకుమార్ ఇతర అధికారులు, ప్రిన్సిపల్స్ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవ వేడుకలు



రేణుకాఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**మర్కుక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని దామరకుంటగ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలను గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీరేణుకాఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రేణుకా ఎల్లమ్మ అనుగ్రహంతో ప్రజలందరూ బాగుండాలని కోరారు. అమ్మవారి వార్షికోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మవారి దీవెనలు ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి ఎల్లాగౌడ్, సభ్యులు బొల్లపల్లి చంద్రంగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కిషన్‌గౌడ్, రవిగౌడ్, కిష్టాగౌడ్, నర్సాగౌడ్, కుమార్‌గౌడ్, రమేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, కుమార్‌గౌడ్, అశోక్‌గౌడ్, నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులను పరిశీలించిన తహసీల్దార్



దిగుబడి అయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమ్యశ్రీ

**నిజాంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
నిజాంపేట మండలంలోని పలు రైస్ మిల్లులను మంగళవారం నిజాంపేట తహసీల్దార్ రమ్యశ్రీ పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ రైస్‌మిల్ యజమానులు రైతులు తరలించే ధాన్యానికి రిజిస్టర్ లో పొందుపరచాలని, రైతులు రైస్‌మిల్లులకు తరలించే ధాన్యాన్ని తేమశాతం లేకుండా తీసుకురావాలని అదేవిధంగా రైతులందరూ ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ ధర పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రీతి, సిబ్బంది రాజలింగం పాల్గొన్నారు.

## మెగాహెల్త్ క్యాంప్ విజయవంతం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
రెడ్‌క్రాస్ మల్లారెడ్డి ఆసుపత్రి నిర్వహణలో..రామాయంపేట మండల పరిధి కాట్రియాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్యశిబిరం విజయవంతమైంది. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి నిర్వహణలో చేపట్టిన శిబిరంలో 260 మందికి ఉచిత పరీక్షలుచేశారు. ప్రత్యేక వైద్యులు చేరుకొని ఈసిజి, బిపి, షుగర్ పరీక్షలతోపాటు, మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడివో షాజీలొద్దీన్, రామాయంపేట మాజీ కౌన్సిలర్లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్, చిలుక గంగాధర్, కాట్రియాల మాజీ సర్పంచ్ మైలారం శ్యాములు, బిఆర్ఎస్ నాయకులు శ్యామ్‌రెడ్డి, రాజేందర్‌గుప్తాలతోపాటు రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు చంద్రబోస్, మద్దెల సత్యం, డీలర్ శ్రీనుతోపాటు మల్లారెడ్డి ఆసుపత్రి హెల్త్ క్యాంపు నిర్వాహకులు రవిశంకర్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతుల ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

**వెల్దుర్తి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
వెల్దుర్తి మండలంలోని ఉప్పు లింగాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు కానీ ధాన్యం సేకరించడంలేదని రైతులు ఆగ్రహానికి గురై మంగళవారం మెదక్. వెల్దుర్తి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రైతులు ఆరుకాలంకష్టించి పండించిన వరి ఎండకు ఎండుతూ వానలకు తడుస్తూ రైతుల పాలిట అప్పులకుప్పలుగా ఉన్నాయని అందుకు అధికారులు ఎంతో ఆదరాబాదరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు కానీ అందులో ధాన్యాన్ని సేకరించడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని త్వరగా సేకరించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అకాలవర్షాలతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని అయినప్పటికీ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చినప్పటికీ అధికారుల నిరక్ష ్యం వల్ల ధాన్యం అక్కడే ఉంటుందని రైతులు వాపోయారు. ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఉపాధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**ఝరాసంగం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన ఝరాసంగంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధి కూలీలతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ రోజుకు 3వందల రూపాయల కూలీ వచ్చేలా మెజర్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. వేసవి మండుటెండలను దృష్టిలో పెట్టుకుని ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందచేయాలని ఎంపిడిఓ సుధాకర్‌కు సూచించారు. తమకు కూలీపనులు చేసినా సమయానికి కూలీడబ్బులు అందడంలేదని ఉపాధికూలీలు అదనపుకలెక్టర్ దృష్టికి తీసుకుపోగా సమయానికి కూలీడబ్బులు బ్యాంక్ ఖాతాల్లో క్రెడిట్ అయ్యేలా చేస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

## రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌లుగా ఉపాధ్యాయుల ఎంపిక

**మర్కుక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వేసవిసెలవుల్లో శిక్షణ ఇచ్చేందుకుగాను 152 మంది సబ్జెక్టు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌లుగా పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. మొత్తం 641మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం జరిగిన ఇంటర్వ్యూలలో 393మంది హాజరయ్యారు. మర్కుక్ మండలం నుండి ఇద్దరు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌లుగా ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు. దామరకుంట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చినబ్రహ్మయ్య, ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఓంకార్ రాధాకృష్ణ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్‌గా ఎంపికైన సందర్భంగా వారిని అభినందించారు.

# కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం

-మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**మెదక్ అర్బన్, 29, ఏప్రిల్, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటూ కాపాడుకుంటుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. మెదక్ జిల్లాకేంద్రంలో స్థానికసంస్థల ఎన్నికల పరిశీలకులు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్, జాతీయ యువజన మాజీ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ హాజరైన ఈసమావేశం డిసిపి అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈకార్యక్రమంలో పార్టీ సంస్థాగత ఎన్నికలపై వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతుందని వివరించారు. రాష్ట్రంలోనే ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ఏడుపాయలకు ఇప్పటివరకు సిఎం హోదాలో ఎవ్వరు రాలేదని, కానీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి ఏడుపాయల, చర్చి అభివృద్ధికి వందలకోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. గత పాలకులు పదేళ్ల పాటు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, కానీ కాంగ్రెస్ వచ్చిన తర్వాత అభివృద్ధి ప్రజలకు తెలుస్తుందని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన ధరణి కెసిఆర్ కుటుంబానికి మాత్రమే పనిచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూమాతతో అన్ని భూసమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 22 వేల కోట్లు ఏకకాలంలోనే రైతు రుణమాఫీచేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధితో బిఆర్ఎస్ ఆగమాగం అవుతుందని, రజతోత్సవ సభ కూడా పూర్తిగా ఫెయిల్ అయిందని విమర్శించారు. మెదక్ ప్రజల కోసం మెడికల్ కళాశాల, సెంట్రల్ మెడికల్ స్టోర్, 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాల తీసుకువచ్చామని తెలిపారు. సంస్థాగత ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో రెండు విధాల నేతలు, కార్యకర్తలు ఉన్నారని, ఎన్నికలు ముందు వచ్చిన, గతంలో ఉన్నవారు ఉన్నట్టు చెప్పారు. పార్టీ కోసం కృషిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానంకోసం పదవులకోసం దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. పార్టీ నియోజకవర్గంలో రెండు బ్లాక్‌లుగా ఏర్పాటు చేసి పదవులు ఇచ్చేలా అధిష్ఠానం కృషి చేస్తుందని చెప్పారు. పార్టీలో ఉండి పార్టీకోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరు పదవులు పొందాలన్న ఉద్దేశ్యంతో పదవులకు దరఖాస్తులు తీసుకుని, పరిశీలన చేస్తామని చెప్పారు. ఇందులో ప్రతి ఒక్క కార్యకర్త దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నేతలు ఆవుల రాజిరెడ్డి, సుఖాసినిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సుప్రభాతరావు, పల్లె రామచందర్ గౌడ్, చంద్రపాల్, హఫీజ్‌తోపాటు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం టెర్రరిస్టుల దాడిలో పహల్గాంలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు సమావేశంలో అందరూ నివాళి అర్పించారు.

## బసవ జయంతిని పుర్కరించుకుని రక్తదాన శిబిరం

-శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
ఈనెల 30 విశ్వగురువు మహాత్మా బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దత్తగిరి కాలనీ బసవ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌పాటిల్, పట్టణఅధ్యక్షులు డాక్టర్ శరణప్ప, రాష్ట్ర మహిళాఉపాధ్యక్షురాలు వినయ పాటిల్, జహీరాబాద్, ఝరాసంగం మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్ శేరి, నాయకులు నామ రవికిరణ్, మాజీ పట్టణ అధ్యక్షులు మోహియుద్దీన్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మహిళా నాయకురాలు పద్మజ, తులసిదాస్, సందీప్‌రాజ్, నగేష్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## గన్‌పార్క్ వద్ద నివాళులు అర్పించిన కార్పొరేటర్



నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్, బిఆర్ఎస్ రాష్ట్రనేత

**రామచంద్రాపురం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
ఈనెల 22న జమ్ము కాశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో ఉగ్ర దాడిలో ఆసువులు బాసిన 28మంది పర్యాటకుల ప్రాణాలకు గౌరవం తెలుపుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు నిరసనగా హైద్రాబాద్ లోని గన్‌పార్క్‌వద్ద అమరవీరుల స్తూపంవద్ద ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో భారతీనగర్, పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్‌లు వెన్నవరం సింధూ, మెట్టు కుమార్‌యాదవ్, బిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిలు పాల్గొని నివాళులు అర్పించారు. భారతదేశంపై దాడికి తెగబడిన పాకిస్తాన్‌కు తగురీతిలో కోలుకోలేని దెబ్బతీయాలని పిలుపునిచ్చారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభ కాంగ్రెస్‌కు చెంపపెట్టు

-బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శివగారి అంజయ్య

**చేర్యాల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ 17నెలల పాలనలో వైఫల్యాలు, అబద్ధపు హామీలు, దౌర్జన్యాలకు బిఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవసభ చెంపపెట్టులాంటిదని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శివగారి అంజయ్య అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అంజయ్య పాల్గొని మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించిన బిఆర్ఎస్ సభకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఘనవిజయంగా ముగిసిందని ఆయన అన్నారు. రానున్నరోజుల్లో కాంగ్రెస్‌పార్టీ కనుమరుగై టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. అందుకు బిఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభనే నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 17నెలల్లో తెలంగాణను అన్నిరంగాల్లో ఆగం చేసిందని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్రశ్నిస్తే ఒక్క మంత్రి కూడా సమాధానం చెప్పలేనిస్థితిలో ఉన్నారన్నారు. సభకు వచ్చిన ప్రజలనుచూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సమావేశంలో పలువురు బిఆర్ఎస్ నాయకులున్నారు.

## నాయిబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి

-సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు అందోల్ కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు అందోల్ కృష్ణ

**చౌటకూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
నాయిబ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సర్పంచుల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు అందోల్ కృష్ణ అన్నారు. మండలకేంద్రమైన చౌటకూరులో మంగళవారం ఏర్పాటుచేసిన నాయిబ్రాహ్మణుల మండలసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ నాయిబ్రాహ్మణులను ఉద్దేశించి మాట్లాడుతూ నాయిబ్రాహ్మణులు దశాబ్దాల తరబడి ఆర్థికంగా అసమానతలు ఎదుర్కొంటున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తిలో మినహాయిస్తే మిగతా ఏరంగంలోనూ నాయిబ్రాహ్మణులు రాణించిన దాఖలాలులేవని విచారం వ్యక్తంచేశారు. నాయిబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వందృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా తనవంతు కృషిసల్పుతానని హామీనిచ్చారు. ఈసందర్భంగా నాయిబ్రాహ్మణులసంఘం చౌటకూరు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణను నాయిబ్రాహ్మణులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణులసంఘం మండల అధ్యక్షులు బోనోళ్ల గంగార, మామిళ్ల నాగభూషణం, శివకాంతం, మురళీ, వీరన్న, రాజరాం చెర్యాల ఆంజనేయులు, సత్తయ్య, హరీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పోలీస్ వాహనాలకి ఉపయోగించిన విడిభాగాలు, టైర్లు, బ్యాటరీల వేలంపాట

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి ఐపిఎస్ మాట్లాడుతూ పోలీస్‌వాహనాలకి ఉపయోగించిన విడిభాగముల, టైర్స్, బ్యాటరీల వేలంపాటలో ఆసక్తిగలవారు పాల్గొనాలని సూచించారు. ఇందుమూలంగా జిల్లా ప్రజలకు, ఆసక్తి గల వ్యాపారులకు తెలియజేయునది ఏమనగా, జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో, పోలీస్‌శాఖ వాహనాలకు వాడబడినటువంటి, కాలపరిమితి పూర్తి అయినటువంటి టైర్లు, బ్యాటరీలు, విడిభాగాములను మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న పాత ఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో తేది: 05/05/2025 రోజు ఉదయం 10గంటలకు వేలంపాట వేయడం జరుగుతుంది. కావున ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొని ఇట్టి వాహనాల టైర్లు, బ్యాటరీలు, విడిభాగాలను తమస్వంతం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఏదైనా సమాచారం కావాలంటే రిజర్వ్ ఇన్స్పెక్టర్ శైలందర్ 8712657912ని సంప్రతించాలని అన్నారు.

## అపరేషన్ కగార్ నిలిపివేయాలి

-టిపిసిసి కార్యదర్శి యాదగిరి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు యాదగిరి

**నంగునూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**
ఆపరేషన్ కగార్ కాల్పులకు విరమణ ప్రకటించి శాంతిచర్చలు జరపాలని టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి డిమాండ్‌చేశారు. మంగళవారం నంగునూర్ మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. చర్చలకు సిద్ధమని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో కేంద్రసర్కారు ముందుకురావాలన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లోని అన్నిరాజకీయపార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. చర్చలద్వారా మాత్రమే శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందన్నారు. కేంద్రసర్కారు జనజీవనస్రవంతిలో కలిసేలా ప్రోత్సహించి వారికి జీవనోపాధి కల్పించడానికి కృషిచేయాలన్నారు. ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తప్పెట శంకర్, అశోక్‌గౌడ్, కనకయ్య, నాగరాజు, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, రాజు, కారేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.